

కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



నెల నెలకీ కొన్ని కులాసా కబుర్లు

డబ్బు డబ్బు డబ్బు

చిన్నప్పుడు ఆంధ్ర సచిత్ర వారపత్రికలలో, యువ మాస పత్రికలలో సీరియల్స్ వచ్చేవి. అమ్మావాళ్ళు అవి తీసి పుస్తకం కుట్టుకున్నాక, ఏ అట్లు వేస్తున్నప్పుడో, ఏ తిరగేసేటప్పుడో ఓ పేజీ చదువుకుంటూ, టైం మేనేజ్‌మెంట్ చేసుకునేవారు. మధ్య మధ్యలో అవి చదువుతూ చదువుతూ ఏ ఉప్పు డబ్బామీదో బోర్లించి పెట్టేవారు. పుస్తకాలు కాకపోతే రేడియో తప్ప వేరే ఎంటర్‌టైన్‌మెంట్ సాధనాలు వుండేవి కావు. కార్మికుల కార్యక్రమం, సిలోన్ నుండి గాలి తరంగాలతో పాటు లీలగా చిక్కిపోతూ, లావైపోతూ వచ్చే తెలుగుపాటలూ "అక్కయా.. రంగుల రాట్నం సినిమా నుండి ఈ పాట వినిపించమని కోరుతున్న..." అని ఎనౌన్సర్ బండ గొంతూ, మీరు కోరిన పాటలూ, రాత్రిపూట 'యవామహల్,' 'ఛాయాగీత్', 'ఝూలే భిన్సే గీత్,' అమ్మ గాయని గనక మోగేవి.

ఎప్పుడైనా బ్లాక్ అండ్ వైట్‌లో వచ్చే మార్నింగ్ షోలకి అర్ధరూపాయి టికెట్‌తో మా పిల్లలని తీసుకెళ్ళేవారు పెద్దవాళ్ళు. అవీ పాతాళభైరవీ, కీలుగుర్రం, వెంకటేశ్వర మహత్యం, భూకైలాస్‌లాంటి వాటికి. వాటికి కూడా, ఇంటర్వెల్‌లో మేం ఏమీ కొనమని అడగకుండా, ఇంట్లోంచి ఏ తప్పేళ చెక్కలో చేసి తీసుకొచ్చేవారు. మరచెంబులో మంచినీళ్ళు (ఈ సీసాల దరిద్రం లేదు).

సరే.. ఎగ్జిబిషన్‌కి... దానికి కూడా అమ్మమ్మ కేన్‌లో పులిహోరా, జంబుఖానా, మరచెంబూ, అన్ని షాపులూ చూసేసి, ఏలాయలప్పో, టిక్‌టికో కొనేసుకుని, ఆవిడ పెట్టింది తిని మంచినీళ్ళు తాగి ఇంటికొచ్చేసెయ్యాలి. కానీ డబ్బులు పెట్టి, ఏ బట్టలతో, ఏ చేత్తో చేస్తారో తెలీని పిండి వంటలు కొనుక్కుని తినకూడదని అమ్మమ్మ రూల్.

తరువాత ప్రయాణాలు... తప్పని సరైతే ఓ డజన్ అరటిపండ్లు, ఎప్పుడైనా ఓ బిస్కెట్ ప్యాకెట్ తప్ప కొనేవారు కారు. వాడూ కాఫీ కాఫీ అని మన ముందు అరవైసార్లు తిరిగినా, మస్సాలా వడే.. పూరీ పూరీ పూరీ.. అని తిరుగుతున్నా, పెద్దవాళ్ళు తెచ్చిన దద్దోజనం, పులిహోరా తినాలే తప్ప అవన్నీ అందులోనూ నూనె పదార్థాలూ, సెనగపిండితో చేసినవీ, పొట్ట చెడిపోతుందని వంక పెట్టి అస్సలు కొనేవారు కారు.

మేం పేచీలు పెట్టే వాళ్లం కామా? పెట్టేవాళ్ళం. అమ్మమ్మ జబ్బ పట్టుకుని లాగి కళ్ళెర్ర చేస్తే నోరు మూసుకునేవాళ్ళం.

అట్లా అని మరీ ఏమీ కొనిపెట్టలేదు అని అబద్ధాలూ చెప్పలేము. అమ్మ ప్రతిరోజూ ఏదో ఒక పొట్లం అర్ధరూపాయో, అరవై పైసలో పెట్టి తెచ్చేది. మీరు అంటే ఈ కాలం వాళ్ళు నమ్మకపోయినా, అర్ధరూపాయికి అరకిలో కర్జూరం పండ్లు, లేదా, పావలాకి డజన్ అరటిపండ్లు, అరవై పైసలకి కిలోద్రాక్ష పండ్లు, బుట్ట మూడురూపాయిలు, ఇలా ఏదో ఒక పొట్లం తెచ్చి పెట్టేది ఆఫీస్ నుండి వస్తూ వస్తూ. ఇంక నాగ్‌పూర్ నుండి సంత్రా పండ్లు (కమలాపండ్లు) ఆంధ్రా నుండి నూజివీడు మామిడిపండ్లు, వాకిటి ముందు కొచ్చిన సీతాఫలం పండ్లు బుట్టల్తో కొనేది. బుట్ట మూడు రూపాయలుండేది మహా అయితే.

ఇంక మా పెద్దమ్మా, పెద్దనాన్నగారూ నాగ్‌పూర్ నుండి వస్తే, ఓ తెలుగు సినిమా, సుధా హోటల్‌లో ఇడ్లీ, దోశా, తెలుగు పత్రికల్లో దీపావళి యువా, జ్యోతీ, కాఫీ పొడీ, వక్కపొడీ పొట్లాలు తప్పక కొనుగోలు చేసేవారు.

సుధా హోటల్‌లో కానీ, గోపీ హోటల్‌లో కానీ ఇడ్లీ ఇరవైపైసలో, పావలానో వుండడం నాకు తెలుసు. పావలా అంటే ఏమిటీ? అంటే నాలుగు అణాలు అంటే, అరిటి పండంటే ఏమిటీ అంటే రంభాఫలం అనీ, కొబ్బరికాయ అంటే ఏమిటి అంటే నారికేళం అనీ చెప్పినట్లు అవుతుంది. కాఫీ కూడా ఇరవై పైసలు వుండేది. చిక్కని డికాషన్‌లో అంతకన్నా చిక్కని పాలతో కలిపి నురగలు కక్కే కాఫీ కేవలం ఇరవైపైసలు!

నేను కాలేజ్‌కి వెళ్ళే రోజుల్లో కూడా బస్‌స్టాప్ నుండి, మా ఇంటికి రిక్షా అంటే మనిషి తొక్కే రిక్షా కట్టించుకుంటే రూపాయి అడిగేవారు. కొంతమంది బారాణాకి అంటే డెబ్భై ఐదు పైసలే ఇస్తాం అని బేరమాడేవాళ్ళూ వుండేవారు.

రూపాయికి ఎంతో విలువుండేది. నూరు పైసలుకి నూరుపైసల వేల్యూ వుండేది .బిచ్చగాళ్లకి వెయ్యడానికి రెండుపైసలూ, మూడు పైసలూ జమ చేసి పెట్టుకునేవాళ్ళం. ఐదు పైసలూ, పది పైసలూ తీసుకెళితే కొట్టుకి కాఫీ బిళ్ళ, ఛాపత్తా, ఐదు పైసల బిళ్ళవాటి మీద వేసి వున్నవి వచ్చేవి. పది పైసలకి పది పాలకూర కట్టలొచ్చేవి. మా శ్యామలమ్మతో అర్ధరూపాయి సినిమాకి వెళ్తే, పావలాకి పన్నెండు చిన్న చిన్న ఉల్లిపాయ సమోసాలొచ్చేవి. శ్యామలమ్మ అంటే మా పనిమనిషీ, నా ఇష్టసఖీ.

మరి అలాంటి రోజుల్లో ఇప్పటిలా జీతాలొచ్చేవా? లేదు. అమ్మ సీనియర్ క్లర్క్, అంటే చాలా సర్వీస్ వున్న క్లర్క్‌గా 300రూపాయలు ఆర్.టీ.సీ.లో తెచ్చేది. నాన్నకి స్టేట్ గవర్నమెంట్‌లో 350రూ వుండేదేమో. అందులో క్వార్టర్ వుండడానికి ఫ్రీ కనుక కరెంట్‌కీ, నీళ్ళకీ పదిరూపాయిలూ, పేపర్, పాలు, కూరలూలాంటి వాటికి యాభై మొత్తం వెచ్చాలుకి 120 రూపాయలనుండి 150 వరకూ.. ఈ ఖర్చులు ఇలా వుండేవి. నాకు ఇంగ్లీష్ మీడియం అని ఏడోతరగతికి ఐదు రూపాయిలూ, మా అన్నలకి తెలుగు మీడియానికి చెరి మూడు రూపాయిలూ, (మా పెద్దమ్మ పిల్లలు కూడా వుండేవారు).. మాది ప్రభుత్వ పాఠశాల కాదు మిషనరీ హైస్కూల్. మా అన్నలు స్కాలర్ షిప్ తెచ్చుకోవడంవల్ల ఆ ఫీజ్ కూడా మాఫీ అయ్యేది.

పది పైసల టికెట్ కొని, మా గోల్కొండ చౌరస్తా నుండి సికింద్రాబాద్ స్టేషన్‌కి ఆర్.టీ.సీ బస్‌లో ప్రయాణించేవాళ్ళం. ఊళ్ళకి అమ్మతో ఫ్రీ.

వెయ్యిరూపాయిల జీతగాడు అంటే పెద్ద ఆఫీసర్. నాలుగంకెల జీతం అన్నమాట. మామావయ్య ఒకాయనకి వెయ్యి రూపాయిల జీతం, అందుకే ఆయన స్కూటర్ కొన్నాడు. మొదటగా టీవీ కొన్నది కూడా ఆయనే మా బంధువుల్లో.

మల్లెపూలు వెయ్యి ముప్పై పైసలు. అలా లెక్కపెట్టి ఇచ్చేవారు కూడా.

అందరికీ పెరట్లో కాసిన కూరగాయలూ, దేవుడి పూజకి పనికొచ్చే మూడు పూలచెట్లూ, అవసరానికి అరటి చెట్టూ, శుభకార్యాలకి మామిడీ వుండేవి.

అపార్ట్‌మెంట్ల కల్చర్ అప్పటికి లేదు.

శనివారం హిందీ సినిమా, ఆదివారం తెలుగు సినిమా టీ.వీలో వేస్తారని అందరం పొలోమనిపోతే, చాపలు వేసి, వేరుశనగ గుళ్ళు సిద్ధంగా వుంచేది మా మణి అత్తయ్య. పెద్దవాళ్లకి కాఫీలు కూడా.

అలా అని మేం తిండికి మొహం వాచి వుండేవాళ్ళం కాదు. డబ్బాలలో కారప్పూసా, కొమ్ము మిఠాయీ, చేగోడీలూ, పప్పు చెక్కలూ, ఇళ్ళల్లో పిల్లల కోసం చేసి పోసేవారు.

రేషన్‌లో నూనె, బియ్యం, కిరోసిన్ చక్కెరో, లైన్‌లలో నిలబడి తెచ్చుకునేవాళ్ళం, మరీ రూపాయి కిలో బియ్యం ముతకగా వుంటాయని అమ్మ తెచ్చేది కాదు. పనిమనుషులకి వదిలేసేవాళ్ళం, శ్యామలమ్మకి ఐదు రూపాయలిస్తే ముందూ వెనకాలా ఇంటిని శుభ్రం చేసి, రెండు పూట్లా గిన్నెలు తోమి, బట్టలు వుతికి, ఇల్లు వూడ్చి పెట్టి వెళ్ళేది.

ఆదివారాలు న్యూస్ పేపర్లు పరిచి, పాటలు పాడుకుంటూ అమ్మా అమ్మమ్మా అప్పడాలు వత్తడం, చేగోడీలు చెయ్యడం, ఇంటిముందు నవారు మంచం మీద పలచని చీర పరిచి వడియాలు పెట్టడం చేసేవారు.

అర్ధరాత్రి అనుకోని అతిధులొచ్చినా పెరట్లో కూరకి పనికొచ్చే అరటికాయలో, రోట్లో పోసి రుబ్బే కందిపచ్చడో, నంజుకి అప్పడం, వడియం, జాడీలో ఊరగాయలూ, సిద్ధంగా వుండేవి.

'పెరుగు తీసుకోండోయ్' అనే నారాయణ గాజు తలుపులున్న బండిలో పెరుగు తీసుకొచ్చి ఇరవై పైసలకి గాజు గ్లాసుడు ఇచ్చేవాడు. మిఠాయి షాపుల్లో కూడా పెరుగు అమ్మేవారు. ఇంటి బాడుగ పదిహేనూ, ఇరవై రూపాయలు కూడా వుండేవి బ్రహ్మచారులకి. కాస్త కుటుంబాలకి అరవై రూపాయిలుండేవి.

నా డిగ్రీ చదువుకి కస్తూరిబా కాలేజ్‌లో మూడు వందలు కట్టింది మా అమ్మ 1983లో. అప్పుడు జీతాలూ అలాగే వుండేవి. ఖర్చులూ అలాగే వుండేవి. మధ్య తరగతి వాళ్ళు కూడా వున్నంతలో పొదుపుగా వుంటే, గుండెల మీద చెయ్యేసుకుని పడుకునేలా వుండేవి.

ఇంక ఇప్పుడు స్థితి గతులూ ఖర్చులూ రాబడీ అన్నీ లక్షల్లోనే. అయినా DINK లే అంటే Double Income No Kids అని. ఒక్క పిల్లాడ్నే ఐదు లక్షలు నెలకొచ్చే ఉన్నతోద్యోగి అయినా పెంచగలడు. నో రెండో సంతానం. అలా వున్నాయి పిల్లల ఖర్చులు.. మూడు లక్షలనుండి ఐదు లక్షలు వాడి ఒకటో క్లాసుకి కడ్తున్నారు. ఇప్పటి సినిమాలు చూస్తే అన్నీ ఆరొందలు కోట్లూ, మూడొందల కోట్లూ బడ్జెటేట. అసలు అన్ని డబ్బులు ఎలా సంపాదిస్తున్నారో ఎలా పోగొట్టుకుంటున్నారో సినిమాల్లో.. ఆలోచిస్తేనే తమాషాగా వుంటుంది. మా చిన్నప్పుడు అక్కినేని నాగేశ్వరరావుగారు సినిమాకి యాభైవేలు తీసుకుంటారట అని విని "అమ్మో! అంత డబ్బే" అని ముక్కుమీద వేలేసుకునేవాళ్ళు.

ఇప్పుడు హీరోకి యాభై కోట్లూ వందకోట్లూట. అందుకే మరి నిర్మాతలు తొందరగా ఒకటో రెండో సినిమాలు తీసి రోడ్డున పడ్తున్నారు.

అందులో కథ అనేది 'అబ్బే వేస్ట్' అని కొట్టి పారేస్తున్నారు. డైలాగ్స్.. బిల్డప్ డైలాగ్స్, ఆల్‌రెడీ రాసేసినవి వుంటాయి, పాటలు వినిపించవు వాయిద్యాల మోతలో, సంగీతం.. తలకి ఒకటో రెండో తూట్లు పడేట్లు వుంటుంది. ఫైట్స్.. ఇవే మెయిన్.. డ్రమ్ముల డ్రమ్ముల రక్తం...తలలు నరకడానికీ, చేతులూ, కాళ్ళూ నరకడానికీ వేరు వేరు ఆయుధాలు. ఆయుధాల తయారీకి కోట్ల రూపాయిలు.. ఆ మారణకాండ ఏ కేప్ టౌన్‌లోనో అమెజాన్ అడవుల్లోనో అయితే మూడు వందల కోట్లు ఒక్క ఫైట్‌కే.. ఇంక పెద్దా చిన్నా అందరి ఏక్టర్లకీ వానిటీ వాన్‌లు.. చిన్న సైజ్ బస్ డిపోని గుర్తు తెస్తుంటుంది.

అందరికీ ఒక మెస్ వుండేది, వంటవాళ్ళు వంట చేసేవారు నేను రేపల్లెలో రాధ, మధుమాసం, అందరి బంధువయా సినిమాలు చేసేటప్పుడు కూడా. ఇప్పుడు ఎవరికి వారే ఫైవ్ స్టార్ హోటల్స్ నుండి తెప్పించుకుని ఆ బిల్ ప్రొడ్యూసర్‌కి పంపుతారు. అలాగే ఎవరికి వారే హెయిర్, కాస్ట్యూమ్స్, మొదలైన సిబ్బందిని ఓ ఇరవైమందిని ఫ్లయిట్‌లో తీసుకెళ్తారు వాళ్ళతో కూడా, బిజినెస్ క్లాస్‌లో. మరి వందల వేల కోట్లు గాల్లోకి ఎగిరి మురికి కాలవల్లో ఎందుకు కలిసిపోవూ? అమ్మా లక్ష్మీదేవీ.. ఏం కాలం వచ్చింది తల్లీ?

Post your comments





